క్లుప్తంగా

భద్రకాళమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న మహిళలు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో భద్రకాళమ్మకు ఆదివారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. పూజ, పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామపెద్దలు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దూదేకుల సంఘం అధ్యక్షుడిగా మస్తాన్

ముత్తుకూరు(పొదలకూరు): దూదేకుల సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా మండలంలోని బ్రహ్మదేవం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు డీపీ మస్తాన్ నెల్లూరు జిల్లా సమావేశంలో మస్తాన్‌ను ఎంపిక చేశారు.

పీఏసీఎస్ నియామకం

పొదలకూరు: మండల పీఏసీఎస్ పాలకమండలిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చైర్మన్‌గా తలచీరు మస్తాన్‌బాబు, డైరెక్టర్లుగా కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, గంటా మల్లికార్జున్‌యాదవ్‌ను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కావలిలోని ఉదయగిరి రోడ్డు ప్రాంతానికి చెందిన రమణమూర్తి పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి కావలికి వెళ్తుండగా పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణమూర్తికి గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.


విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఆర్ఎన్నార్ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో ఆదివారం మృతిచెందిన విద్యార్థినికి సంబంధించి సమగ్ర విచారణ చేపట్టాలని, అందుకు కారకులైన యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శిఖరం నరహరి, ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఆ కళాశాల వారు ఎలాంటి అనుమతుల్లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. జిల్లాలో అనుమతుల్లేకుండా కళాశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న హాస్టల్స్‌ను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహిస్తూ.. మార్కుల పేరిట తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న అంశంపై లోతుగా దర్యాప్తు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.

14న కోవూరులో జాబ్‌మేళా

నెల్లూరు(పొగతోట): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఈనెల 14న కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 800 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా జరుగుతుందని, కోవూరు నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ చదివిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 93812 65558, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేత్రదానం



బాబురెడ్డి (ఫైల్)

నెల్లూరు(అర్బన్): స్థానిక అల్లీపురంలోని పీఎస్సార్ నగర్‌కు చెందిన పాపారెడ్డి బాబురెడ్డి (72) శనివారం రాత్రి ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యుడు రఘురామ్‌రెడ్డి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ప్రమాదకరంగా పైడేరు వంతెన

ఎంతో ప్రాధాన్యమున్న వంతెనను సైతం నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. వంతెన కూలితే మూడు మండలాలకు ఉపయుక్తంగా ఉన్న దీనిపై రాకపోకలు నిలిచిపోతాయి. దురదృష్టవశాత్తు వరదలొచ్చి హైవేపై కమ్మపాళెం వద్ద పైడేరుపై ఉన్న వంతెన ముంపునకు గురైతే ప్రత్యామ్నాయ మార్గం లేక హైవేపై రవాణా సౌకర్యం పూర్తిగా స్తంభించిపోతుంది. ఇంతటి కీలకమైన వంతెన 40 ఏళ్లుగా శిథిలావస్థలో ఉంది.

- మూడు మండలాలను కలిపే లింక్ రోడ్డు
- అయినా పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ప్రతిపాదనలతో సరిపుచ్చుతున్న అధికారులు



పైడేరు కాలువ



ప్రమాదకరంగా ఉన్న గండవరం, పెయ్యలపాళెం వంతెన

హైవేకు ప్రత్యామ్నాయమైనా నిర్లక్ష్యమే..

హైవేపై కొడవలూరు మండలం కమ్మపాళెం వద్ద పైడేరుపై వంతెన నిర్మించి ఉన్నారు. వరదలొస్తే ఈ వంతెన ముంపునకు గురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా గండవరం, పెయ్యలపాళెం లింకు రోడ్డులో ఉన్న పైడేరు వంతెన ప్రత్యామ్నాయంగా ఉపకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఎప్పుడు కూలుతుందోనన్నట్లుగా ఉంది. కమ్మపాళెం వంతెనకు ఇబ్బంది జరిగితే ప్రత్యామ్నాయం లేక హైవేపై రోడ్డు రవాణా పూర్తిగా స్తంభించిపోతుంది.

కొడవలూరు: మండలంలోని గండవరం, పెయ్యలపాళెం మధ్య లింకు రోడ్డులో పైడేరు డ్రెయిన్‌పై బ్రిటీష్ కాలంలో వంతెన నిర్మించారు. దీనికి ఇరువైపులా గోడలు నిర్మించకుండా కేవలం చిన్నపాటి ఇనుప చువ్వలు మాత్రమే ఏర్పాటు చేశారు. వంతెన వెడల్పు కూడా బాగా తక్కువగా ఉండి ఒక పెద్ద వాహనం మాత్రమే వెళ్లేలా నిర్మించారు. కొడవలూరు, విడవలూరు, దగదర్తి మండలాలను దగ్గరి మార్గంలో కలిపేందుకు ఈ లింకు రోడ్డు దోహదపడుతోంది. కోవూరు మండలం పాటూరు మీదుగా కొడవలూరు మండలం యల్లాయపాళెం, దాసరిపాళెం, కొత్తవంగల్లు రోడ్డు, సంగాయపాళెం, గండవరం, పెయ్యలపాళెంల మీదుగా దగదర్తి మండలం ఊచగుంటపాళెం, తడకలూరు, దగదర్తిల మీదుగా సున్నపుబట్టి వద్ద హైవేను కలుపుతుంది. ఈ లింకు రోడ్డును మినీ హైవేగానూ అభివర్ణిస్తుండడం గమనార్హం.

శిథిలావస్థలో..

గండవరం, పెయ్యలపాళెం మధ్య 80 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వరి కోతల సమయంలో ధాన్యపు లారీలు ఈ వంతెన మీదుగానే పోవల్సి ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. పైగా వంతెనపై వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైంది. ఈ గుంతల్లో వాహనాలు పడి అదుపు తప్పితే రోడ్డు వెడల్పు లేకపోవడం, ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడం వల్ల కాలువలోకి దూసుకెళ్తుంది. గతంలో ధాన్యపు ట్రాక్టర్ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన తర్వాత కూడా సంబంధిత అధికారులు వంతెన గురించి దృష్టి సారించలేదు.

రైతులకూ ఇక్కట్లే..

పైడేరు కాలువ కేవలం డ్రెయిన్‌గానే కాక సాగు నీటి కాలువగానూ ఉపకరిస్తోంది. అల్లూరు మండలంలోని సాగునీటి కాలువలకు పైడేరు నుంచే పంట కాలువల ద్వారా సాగు నీరందుతాయి. కొడవలూరు మండలంలోనూ సుమారు వెయ్యి ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగు నీరందుతాయి. గండవరం, పెయ్యలపాళెం మధ్య వంతెన కూలినా లేక కమ్మపాళెం వద్దున్న వంతెన కూలినా కొడవలూరు మండలంలో దిగువనున్న వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు నిలిచిపోతాయి. రైతులు పంటను వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ప్రతిపాదనలతో సరి

పైడేరు పొలాల్లోని పులక నీటిని సముద్రానికి తరలించే డ్రెయిన్ అయినందున దీని నిర్వహణ ఇరిగేషన్ శాఖలోని డ్రెయిన్స్ విభాగం వారు చూస్తారు. కానీ వారు డ్రెయిన్స్ వైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలుండడం లేదని రైతుల వాపోతున్నారు. ఎప్పుడైనా రైతులే వెళ్లి వంతెన గురించి పట్టించుకోవాలని, పునర్నిర్మించాలని కోరినా ప్రతిపాదనలు పంపి ఉన్నామంటూ దాట వేస్తున్నారే తప్ప వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. గతంలో ట్రాక్టర్ పైడేరులో పడినప్పుడు రైతులు అధికారులను వంతెన పునర్నిర్మాణం చేయాలని కోరారు. ప్రతిపాదనలు పంపి ఉన్నందున త్వరలోనే నిర్మిస్తామని చెప్పి దాటవేశారే తప్ప కార్యరూపం దాల్చలేదు.

పూర్తిగా పునర్నిర్మించాలి



గండవరం, పెయ్యలపాళెం మధ్య పైడేరుపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేయడం ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదు. పూర్తిగా తొలగించి పునర్నిర్మాణం చేస్తే ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, రైతు, పెయ్యలపాళెం

దిగువ ఆయకట్టుకు ఇబ్బందే..



పైడేరుపై నిర్మించి ఉన్న రెండు వంతెనలలో ఏది కూలినా దిగువనున్న ఆయకట్టుకు సాగు నీరు నిలిచిపోతాయి. 2015లో వచ్చిన వరదలకు దామేగుంట కొండాయపాళెం వద్ద పైడేరుపై నిర్మించిన వంతెన కొట్టుకుపోయి అల్లూరుకు రెండు నెలలపాటు రాకపోకలు నిలిచిపోవడంతోపాటు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి ఘటనలను దృష్టిలో పెట్టుకుని శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలి.

– పి.శ్రీనివాసులురెడ్డి, రైతు, గండవరం

కాకాణి పూజితకు అభినందనలు



టీపీగూడూరు : అభినందలు తెలియజేస్తున్న నాయకులు



మనుబోలు : పూజితను అభినందిస్తున్న నాయకులు

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితను ఆదివారం నెల్లూరులోని నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీ ఆవుల తులసీరాం మాట్లాడుతూ పూజితను మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ అభివృద్ధికి ఆమె కృషి చేస్తున్నారని కొనియాడారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ మండలంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

- **తోటపల్లిగూడూరు:** కాకాణి పూజితకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అభినంధనలను తెలిపారు. ఆదివారం నెల్లూరులో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, తలమంచి సురేంద్ర బాబు, చెరుకూరు శ్రీనివాసులనాయుడు, ఉడా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విచ్చేయడంతో ఆ ప్రాంగణం కిటకిటలాడింది. ముజావర్లు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ, సుబ్రహ్మణ్యశర్మ అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకున్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

పొదలకూరు: పట్టణంలో గంగమ్మతల్లి కొలుపు సందర్భంగా చివరిరోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పూజలు, 11 గంటలకు ముగ్గు దిష్టి తీర్పు, సాయంత్రం వైభవంగా బోనాల ఊరేగింపు జరిగింది. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దేవస్థాన ప్రాంగణంలో పొంగళ్లు పెట్టుకున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు, విద్యార్థులు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న గాంధీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఆదివారం ఉదయం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ సభ్యులు, విద్యార్థులు గాంధీ విగ్రహానికి, స్థలదాత పొనకా కనకమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం సెంటర్లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ అదానీ సంస్థకు రూ.కోట్ల ఆదాయం సమకూర్చే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా, నాయకులు మోచర్ల రాధయ్య, సునీల్, శ్రవంత్, లెనిన్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సొసైటీ చైర్‌పర్సన్ల ఎంపిక

కోవూరు: కోవూరు నియోజకవర్గంలోని వ్యవసాయ సొసైటీ చైర్‌పర్సన్ల ఎంపిక జరిగినట్లు కోవూరు సొసైటీ అధికారులు ఆదివారం తెలిపారు. వాటిలో పడుగుపాడు సొసైటీ చైర్‌పర్సన్‌గా నాగారెడ్డి శ్యామసుందర్‌రెడ్డి, సభ్యులుగా నగిశెట్టి జయప్రకాష్, శ్రీనివాసులు ఎంపికయ్యారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఏటూరు శివరామకృష్ణారెడ్డి, సభ్యులుగా కోనంకి కృష్ణయ్య, మాచవరం శ్రీనివాసులు, వవ్వేరు సొసైటీ చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, సభ్యులుగా మద్దసాని మాల్యాద్రి, కోవూరు పద్మ, దామరమడుగు సొసైటీ చైర్‌పర్సన్‌గా రేనిగల్ల సిద్ధార్థ్, సభ్యులుగా గండవరపు లక్ష్మయ్య, సింగిరి రాఘవేంద్రరావు, తలమంచి సొసైటీ చైర్‌పర్సన్‌గా పి.సూర్యనారాయణ, సభ్యులుగా నక్కల రవికుమార్, కె.నాగేశ్వరరావు, యల్లాయపాళెం సొసైటీ చైర్‌పర్సన్‌గా వై.వంశీదర్‌రెడ్డి, సభ్యులుగా వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, ముదివర్తి సొసైటీ చైర్‌పర్సన్‌గా తన్నీరు రాజయ్య, సభ్యులుగా బడుగు మస్తానయ్య, వరిగొండ సుబ్బారావులు ఎంపికైనట్లు సొసైటీ అధికారులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులపై పీ4 భారం

- తక్కువ జీతాలకు, అధిక బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి



మా కుటుంబాలనే దత్తత తీసుకోండి

కోవూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం ఇప్పుడు సచివాలయ ఉద్యోగులపై భారంగా మారింది. దాతల ద్వారా పేదల అభివృద్ధికి రూపొందించిన కార్యక్రమంపై వ్యాపారవేత్తలు, ప్రముఖులు ముందుకు రాకపోవడంతో ప్రచారం కోసమే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే మార్గదర్శకులుగా ఉంటూ దత్తతదారుల పేర్లను నమోదు చేసుకునేలా అధికారుల ఒత్తిడికి గురవుతున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వలంటీర్ల బాధ్యతలతో పాటు ప్రతినెలా కొత్త కొత్త సర్వేలతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వలంటీర్ల పనులు మేమే చేస్తున్నాం

ఇప్పటికే వలంటీర్ల బాధ్యతలను సచివాలయ సిబ్బందికి మళ్లించడం వల్ల వారి పని భారం రెట్టింపు అయ్యింది. వలంటీర్లు నిర్వహించే సర్వేలు, ప్రతి నెలా చేసే సర్వేలతో పాటు ఇప్పుడు మరోసారి పీ4 ముసుగులో 'దత్తత దారులు' పేరుతో జరిగే రిజిస్ట్రేషన్ల పని కూడా సచివాలయ సిబ్బందికే అప్పగించడంతో మనో వేదనకు గురవుతున్నారు. కోవూరు నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాలకు సంబంధించి 927 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 7,725 మంది సిబ్బంది వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడి ఈ అక్టోబర్‌కు ఆరు సంవత్సరాలు పూర్తవుతున్నా, ఇప్పటికీ వేతనాల్లో న్యాయమైన పెరుగుదల లేకపోవడం తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మొత్తం ఏడు ఇంక్రిమెంట్లు రావాల్సిన ఉద్యోగులకు కేవలం మూడు మాత్రమే అందాయి. తర్వాతి స్థాయికి ప్రమోషన్ ఆశలు కూడా నెరవేరక, నెలకు సుమారు రూ.6 వేలు నష్టపోతున్నారు. 'ఒకవైపు పిల్లల చదువులు, మరోవైపు ఇంటి ఖర్చులకు తగినట్లు జీతాలు లేవంటూ వాపోతున్నారు. ఈ క్రమంలో తమనే దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గణనాథుని విగ్రహాలకు డిమాండ్



వినాయకుని బొమ్మలు



తుదిమెరుగులు దిద్దుతూ..

కొత్తదనం కోసం ప్రయత్నం



కొత్త తరహాలో బొమ్మలను తయారు చేసేందుకు ప్రతి ఏడాది ప్రయత్నిస్తూనే ఉంటాం. యువకులు చెప్పిన డిజైన్ మేరకు విగ్రహాలను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ముడిసరకు ధరలు పెరగడం వల్ల మేము కూడా బొమ్మల ధరలను పెంచుతున్నాం.

– ఎం.జనార్దన్, తయారీదారుడు, పద్మావతినగర్, పొదలకూరు

పొదలకూరు: వినాయకచవితి సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో గణనాథుల విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. ప్రతి సంవత్సరంలానే ఈసారి కూడా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తోనే తయారు చేస్తున్నారు. మట్టి విగ్రహాలు కనిపించడం లేదు. కాగా గతంలోలా ఆదాయం ఉండటం లేదని తయారీదారులు చెబుతున్నారు. జీఎస్టీ విగ్రహాల తయారీ ముడిసరుకులకు వర్తించడంతో వ్యయం పెరిగిందంటున్నారు. రాజస్థాన్ ప్రాంతం నుంచి పొదలకూరుకు వచ్చిన తయారీదారులతో ఇక్కడ వ్యాపారంలో పోటీ పెరిగింది. పండగకు కొన్నినెలల ముందే పనులు మొదలుపెడతారు. కొందరు ఉత్సవ కమిటీ సభ్యులు రెండు, మూడు నెలల ముందుగానే తమకు కావాల్సిన డిజైన్ గురించి చెప్పడంతో తయారీదారులు తమ నైపుణ్యంతో విగ్రహాలను రూపొందిస్తున్నారు.

అమ్మకాలు ఎలా ఉంటాయో..

పండగ సమీపిస్తున్నందున విగ్రహాల తయారీలో వేగం పెరిగింది. అయితే ఈ ఏడాది రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన తయారీలుదారులు అమ్మకాలు ఎలా ఉంటాయోనని ఆలోచిస్తున్నారు. గ్రామాల నుంచి బొమ్మల కొనుగోలు కోసం యువకులు వస్తున్నారు. కొత్తదనం ఉంటేనే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. లేదంటే దూరప్రాంతాలకైనా వెళ్లి బొమ్మలను ఎంపిక చేసుకుంటున్నట్లు తయారీదారులు వెల్లడించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పూర్వ కార్యదర్శి బాబురెడ్డి, పరంధామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేసిన సంఘం యూటీఎఫ్ అని తెలిపారు. అయితే సాధించిన హక్కులకు కాలరాసేలా నేటి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై మరోసారి పోరాటం చేయాలన్నారు. పీఆర్సీ, డీఏల సాధనకు మరో పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు సురేంద్ర, అనిల్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బీజేపీ నేతల బైక్ ర్యాలీ

నెల్లూరురూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందుగా హర్ ఘర్ తిరంగాలో భాగంగా రామలింగాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. లెక్చరర్స్ కాలనీ నుంచి ముత్తుకూరు బస్టాండ్ గేటు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు చిలకా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేశ సమైఖ్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మదన్‌సాయిరెడ్డి, ఆడపాల మదన్‌సాయిరెడ్డి, నారాయణ, అవినాష్ కిరణ్, పాల్గొన్నారు.